


సహజ వనరులపై, అభివృద్ధి క్రమంపై ఆధిపత్యం సంపాదించుకున్న ప్రాంతాలు ప్రపంచం అంతటా ఇతర ప్రాంతాలపై రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అజమాయిషీ చేస్తున్నాయి. ఈ క్రమంలో వెనుక ఉంచబడ్డ ప్రాంతాల ప్రజల హక్కులు, జీవన విధానం, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, భాష చిన్నచూపుకు గురవుతున్నాయి. ఆ ప్రాంతాల ప్రజలు అన్ని రంగాలలోనూ తమ హక్కులను అనుభవించలేకపోతున్నారు. తమ అస్థిత్వం, ఉనికి ప్రశ్నార్థకంగా మారినప్పుడు వాటిని నిలబెట్టుకోవాలనే కాంక్ష ఉద్యమరూపంలో బయటపడుతుంది. పలుమార్లు ముందుకొచ్చిన తెలంగాణ ఉద్యమాన్ని కూడా హక్కులలేమి నేపథ్యంలో వాటి సాధనకోసం ముందుకు వస్తున్న ప్రజల తపనగా, ఆకాంక్షగా మానవహక్కుల వేదిక చూస్తోంది. ఇతర ప్రాంతాల ప్రజలు కూడా ఆ విధంగానే దాన్ని చూడాలని కోరుకుంటోంది.

గత పదేళ్ళలో ప్రతి ఎన్నికలపుడూ తెలంగాణ అంశంపై సానుకూలత తెలపని రాజకీయ పార్టీ లేదు. వామపక్షాలు సైతం పార్లమెంటులో ప్రత్యేక తెలంగాణ బిల్లు పెడితే వ్యతిరేకించబోమని ప్రకటించాల్సి వచ్చింది. దీనికంతటికి కారణం ప్రత్యేక తెలంగాణ పట్ల ప్రజాభిప్రాయం బలంగా వుందని ప్రతి రాజకీయ పార్టీ గ్రహించడమే. తమకు ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజ మరోసారి రోడ్లమీదకు రావడంతో రాష్ట్ర విభజనకు ఈ దఫా ఢిల్లీ కాసింత సానుకూలత ప్రకటించక తప్పలేదు. దీంతో ప్రాంతీయాధిపత్య రాజకీయాలు పేట్రేగిపోయాయి. రాష్ట్ర విభజనకు ససేమిరా అంటున్నారు సమైక్యాంధ్ర నాయకులు. చర్చించకుండానే విభజన ప్రక్రియేమిటంటూ పార్టీలకు అతీతంగా చిదంబరంపై నిప్పులు చెరిగారు. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ఆకస్మికంగా ముందుకు వచ్చినట్టూ, మునుపెన్నడూ అధికార, అనధికార స్థాయిల్లో దాని గురించి చర్చే జరగనట్లూ అమాయకత్వం నటిస్తున్నారు. చర్చకంటే రచ్చవల్లే ప్రయోజనం దక్కుతుందని భావించి పౌరసమాజంలో ప్రజాస్వామికంగా, హేతుబద్ధంగా జరగాల్సిన చర్చలను రచ్చరచ్చ చేస్తున్నారు. ఇంకిప్పుడు మిగిలింది విద్వేషాలూ, ఉద్రేకాలూ, వాటిపై నడిచే హీన రాజకీయాలే.

ఏ 'అభిప్రాయం' కోసమైనా అధిష్టానం వైపు చూసే పార్టీల నేతలంతా నేడు తెలంగాణ విభజన విషయంలో ఏకాభిప్రాయం, విస్తృత చర్చలు అంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రంలో విపరీతమైన విధ్వంసం సృష్టిస్తున్న సింగరేణి ఓపెన్ కాస్టు మైన్‌లు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, కోస్టల్ కారిడార్లు, పోలవరం వంటి అనేక విషయాల్లో ప్రజల అభిప్రాయాలకు విలువనివ్వని పార్టీలన్నీ ఇప్పుడు మాత్రం 'ప్రజాభిప్రాయం' అంటూ పూనకమొచ్చినట్లు ఊగిపోతున్నారు. ఓట్ల కోసం తెలంగాణకు ఊకొట్టి తీరా సమయమొచ్చేసరికి మోకాలడ్డుతున్నారు. ఇదంతా దేన్ని సూచిస్తుంది? ఆధిపత్య రాజకీయాలలోని స్వప్రయోజనాలను, రెండు నాల్కల ధోరణిని తప్ప. నైతిక పునాదుల మీద రాజకీయాలు నడపటం మాట అటుంచి కనీసం ప్రజలు తమ గురించి ఏమనుకుంటారో అన్న భయం కూడా లేకుండా పోయింది వాళ్లకు. గతంలో యిచ్చిన హామీలకు, ఒప్పందాలకు, జరిగిన చర్చలకు, ఆందోళనలకు ఏ విలువా లేకుండా పోయింది.

తెలంగాణ ఉద్యమానికి ఐదు దశాబ్దాల చరిత్ర ఉంది. రాష్ట్ర ప్రతిపత్తి డిమాండ్ తలెత్తడానికి అనేక సామాజిక, ఆర్థిక, చారిత్రక కారణాలున్నాయి. తెలంగాణ ప్రజలపై స్థానికేతరుల ఆధిపత్యం వర్తమానంలోనే కాదు, గతంలోనూ వుండింది. బహమనీల కాలంలో పరదేశీలూ, నిజాం హయంలో ఉత్తరాది రాష్ట్రాల వాళ్ళు, ఆ తర్వాత నాన్ ముల్కీలూ, ఇప్పుడేమో ప్రాంతేతరులూ తమ ఉద్యోగ ఉపాధి అవకాశాలను చేజిక్కించుకుపోయారని తెలంగాణవాదులనడంలో పూర్తి సత్యం ఉంది. ఉద్యోగాలు ఉత్తర హిందూస్థాన్ నుండి వచ్చిన వారికి కాక స్థానికులకు కల్పించాలన్న డిమాండ్‌తో 1890లో తలెత్తిన ముల్కీ ఉద్యమం తెలంగాణ ప్రతిపత్తిని కాపాడుకోవాలన్న ఆకాంక్షకు ఊపిరిపోసింది. ఆ ఉద్యమం ఇక్కడి ఉర్దూ భాష, సంస్కృతుల పట్ల లక్నో నుండి వచ్చిన వారు చేసిన ఈసడింపులకు వ్యతిరేకంగా కూడా వచ్చింది. ఆ తర్వాత నిజాం నిరంకుశ పాలనలో తెలుగుభాష, సంస్కృతులను కాపాడుకోవడానికి తెలంగాణ ఆంధ్ర జన సంఘం, తెలంగాణ ఆంధ్ర మహాసభలు చేసిన కృషి వలన తెలంగాణ ఉనికిని నిలబెట్టుకోవాలన్న ఆలోచన బలపడింది. ఈ చారిత్రక పరిస్థితుల వలన ఉమ్మడి రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ఆకాంక్షలకు ఆటంకమవుతుందనే భావన స్వాతంత్ర్యం తరువాత బలంగానే వ్యక్తమయింది.

'విశాలాంధ్ర' ఏర్పాటుపట్ల తెలంగాణవాసులు తొలినుండి విముఖంగా ఉండటానికి గల ముఖ్య కారణం విద్య విషయంలో తెలంగాణ వెనుకబడి ఉండటం. ఆధునిక పాలనాయంత్రాంగంలోనూ, ఆర్థిక రంగంలోనూ ఉద్యోగాలు పొందాలంటే బ్రిటిష్‌వాడు ప్రవేశపెట్టిన నమూనాలో విద్యావంతులై ఉండాలి. అందుకే దేశవ్యాప్తంగా బ్రిటిష్ పాలిత ప్రాంతాలు స్థానిక సంస్థానాల కింద ఉన్న ప్రాంతాలకంటే స్వాతంత్ర్యం వచ్చే నాటికి విద్యా ఉద్యోగ విషయాల్లో ముందున్నాయి. చాలా విషయాల్లో తెలంగాణ కంటే వెనుకబడి వున్న రాయలసీమ కూడా ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికి విద్య విషయంలో మాత్రం తెలంగాణ కంటే ముందుంది. అభివృద్ధి విషయంలో విద్యకుండే ప్రాముఖ్యాన్ని బట్టి ఆ అసమానత అసమాన అభివృద్ధికి దారితీయగలదన్న ఆందోళన రాష్ట్రావతరణ ముందునుండే వ్యక్తం అయ్యింది. 1952లో బూర్గుల రామకృష్ణరావు ముఖ్యమంత్రిగా ఏర్పాటైన హైదరాబాద్ రాష్ట్రంలోనూ కోస్తా నుండి వలస వచ్చిన వారితో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ అయ్యాయి. దానికి వ్యతిరేకంగా చేసిన ఆందోళనే 'గైర్ ముల్కీ నహీచలేంగే'. ఆనాటి ప్రభుత్వమూ అణచివేతకే పూనుకుంది.

PDF processed with CutePDF evaluation edition www.CutePDF.com

ఫలితంగా 18 మంది మరణించారు. వందలమంది గాయపడ్డారు. ఈ నేపథ్యం కూడా దృష్టిలో వుంచుకునే ఫజల్ ఆలీ కమీషన్ (రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషన్ -ఎస్ఆర్‌సి) తెలంగాణను ఆంధ్రతో విలీనం చేయడానికి ఒప్పుకోలేదు. 1961లో హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికల తర్వాత 2/3 వంతు శాసనసభ్యులు అంగీకరిస్తేనే హైదరాబాద్ రాష్ట్రం (తెలంగాణ) ఆంధ్ర రాష్ట్రంతో విలీనం కావొచ్చునని ఆ కమీషన్ సూచించింది.

అయినా రెండు ప్రాంతాలకు చెందిన పెద్దమనుషులు ఢిల్లీలో కూర్చుని విస్తృతమైన సంప్రదింపులేమీ జరపకుండానే ఉమ్మడి రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఒప్పందానికి వచ్చారు. ఈ ఒప్పందం రెండు రాష్ట్రాల విభిన్న చరిత్రల కారణంగా జరిగిందనే విషయం మరిచిపోకూడదు. ఒకే భాష కలిగిన ఒకే రాష్ట్రంలో వుండాలనే భావనకు పునాదైన ఈ ఒప్పందాన్ని సీమాంధ్ర రాజకీయ నాయకులు ఏనాడూ గౌరవించలేదు. ఆచరణలోకి తేలేదు. ఐక్యత మాటున ఆధిపత్యం చెలాయించారనేది సత్యం. స్వప్రయోజనాలకు లొంగిన తెలంగాణ నాయకత్వమూ ఈ పరిస్థితికి కారణమనే విషయం మరిచిపోలేనిది.

పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘన ఫలితంగానే తెలంగాణపై కోసాంధ్రలోని అభివృద్ధి చెందిన జిల్లాల ఆధిపత్యం స్థిరపడిపోయింది. తెలంగాణ హక్కులు దెబ్బతిన్నాయి. అప్పటికే ప్రచార సాధనాలమీద ఉన్న ఆధిపత్యం వలన, సంపదవలన కోసాంధ్ర సంపన్నవర్గానికీ, మేధోవర్గానికీ విభిన్న సంస్థలపై అజమాయిషీ లభించింది. ఇటు సమాజంలోనూ, అటు రాజకీయ వ్యవస్థలోనూ సంక్రమించిన అధికారం కారణంగా బొగ్గు, కలప, నదీ జలాలు వంటి వనరుల్లో అతిపెద్ద వాటా కోస్తా జిల్లాలదే అయింది.

తెలంగాణ అభివృద్ధికి నిజాం ప్రతిపాదించిన దేవునూరు, తుంగభద్ర, భీమా, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు పక్కకు పోయాయి. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు నాటికి ప్రతిపాదించిన ప్రాజెక్టులు పూర్తయ్యాకే ఇతర ప్రాజెక్టులు చేపట్టాలి. ఈ నియమమూ తెలంగాణలో ఉల్లంఘింపబడింది. నిజాం ప్రతిపాదించిన నందికొండ ఒక్కటే నాగార్జునసాగర్ ప్రాజెక్టుగా అమలైంది. సవరించబడిన సాగర్ కూడా తెలంగాణకు ఇవ్వాల్సినంత నీరు ఇవ్వలేదు. కృష్ణానది పారకం మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎక్కువయినప్పటికీ దానినుంచి ఆ జిల్లా పొందే ప్రయోజనం అతి తక్కువ. ఈ జిల్లా వాసులకు నీరందించడానికి ఉద్దేశించిన జూరాల ప్రాజెక్టు ఆలస్యంగా ప్రారంభమవడమే కాక ఇప్పటికీ పూర్తి సామర్థ్యం స్థాయికి నిర్మాణం కాలేదంటే ప్రాంతీయ వివక్షకు మహబూబ్‌నగర్ ఎంతగా బలయిందో అర్థం అవుతుంది. ఇక ఇదే జిల్లాలోని 87 వేల ఎకరాలకు నీరందివ్వాల్సిన రాజోలిబండ ఆనకట్ట శిథిలావస్థకు చేరుకున్నా ఆధునీకరణను ఇప్పటిదాకా చేపట్టలేదు. జలయజ్ఞంలో దాని ఊసే లేదు. మెదక్, నిజామాబాద్ జిల్లాలకు సాగునీరందించాల్సిన సింగూరు ఇపుడు జంట నగరవాసుల గొంతు తడపడానికే పూర్తిగా వినియోగింపబడుతోంది.

తెలంగాణలో విద్యా వైద్య రంగాల అభివృద్ధికీ, భూసంబంధాల నియంత్రణకూ, విద్యా సంస్థల్లో అడ్మిషన్లు నిర్ధారించే నియమాల రూపకల్పనకూ తెలంగాణ శాసనసభ్యులతో కూడిన రీజనల్ కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేయాలన్నది పెద్దమనుషుల ఒప్పందంలో ఒక షరతు. కానీ ప్రభుత్వం రీజనల్ కమిటీని ఏ విషయంలోనూ సంప్రదించలేదు. చివరికి 1973 లో కమిటీని పూర్తిగా రద్దు చేసింది. ఇన్ని విధాలుగా తెలంగాణ వనరులు దోపిడీకి గురవుతున్నా, ప్రజల హక్కులు నిర్లక్ష్యానికి గురవుతున్నా, తెలుగు భాష మాట్లాడే ప్రజలు సమైక్యంగా ఉండటానికి దొరికిన ఒక అవకాశాన్ని, దానికి పునాదైన ఒప్పందాన్ని ఒక పద్ధతి ప్రకారం నాశనం చేసింతర్వాత కూడా సమైక్యాంధ్ర కొనసాగాలనడం, అభివృద్ధి చెందిన ప్రాంతాల వారి ఆధిపత్యం కొనసాగాలనడమే. పెత్తనం సాగినంత కాలం తెలంగాణ ప్రజల హక్కులను విస్మరించడం, ఆచరణలో నిరాకరించడం, కాకపోతే దబాయించడం, అనివార్యమైతే సంప్రదింపులనడం పాలకులు అనుసరిస్తున్న వైఖరి. అయినా ప్రజలు నోరెత్తకుండా పడివుండాలనుకోవడం అన్యాయం, అప్రజాస్వామికం.

కలిసి ఉందామనే పేరు మీద సమైక్యాంధ్ర ఉద్యమాన్ని సీమాంధ్రనేతలు నడిపించడం తెలంగాణ ప్రజల న్యాయమైన ఆకాంక్షను వ్యతిరేకించడమే. ఆ ప్రయత్నం మాని, ఉత్తరాంధ్ర ప్రజలు లేవనెత్తుతున్న వెనుకబాటుతనానికి సంబంధించిన సమస్యలను, రాయలసీమ ప్రజలకు శాపంగా ఉన్న కరువు, సాగునీటి లేమి సమస్యలను దూరం చేసేందుకు పరిష్కార మార్గాలు వెదకాల్సిన అవసరం వుంది. వాటి కోసం జరిగే ప్రయత్నాలకు తెలంగాణ ప్రజల, మేధావుల సంఘీభావమూ చాలా అవసరం. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో జీవనానికి సంబంధించిన ఇబ్బందుల గురించి భయాలూ, సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. రాజకీయ నాయకులు అహేతుకంగా రెచ్చగొట్టి సృష్టిస్తున్న భయాలను పక్కన పెడితే, సామాన్య ప్రజలకూ సందేహాలున్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన ఏ ప్రాంతం విద్యార్థులైనా ఉద్యోగం కోసం హైదారాబాద్‌వైపే చూస్తున్నారు. అన్ని ప్రాంతాల నుండి జీవనోపాధి వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వలస వస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన ప్రతి నాలుగు కుటుంబాలలో రెండింటికి హైదరాబాద్‌లో బంధుత్వరీత్యాగాని ఇతరత్రాగాని సంబంధాలు నెలకొన్నాయన్నది కూడా గుర్తించాలి. హైదరాబాద్‌ను ఎవరు అభివృద్ధి చేసారనే విషయం ప్రక్కన పెట్టి ప్రజల భయాలు, అనుమానాలు పోగొట్టడం కూడా తెలంగాణవాదుల, ప్రజాస్వామికవాదుల బాధ్యతగా మా వేదిక భావిస్తుంది.

ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల మధ్య ప్రస్తుతం ఏర్పడ్డ ఘర్షణ వాతావరణం, అసంతృప్తి పాలనా విధానాలవల్ల ఏర్పడ్డదే తప్ప, ఈ మూడు ప్రాంతాల ప్రజల మధ్య ఏర్పడ్డ ఘర్షణ కాదు. ఈ వాస్తవాన్ని మూడు ప్రాంతాల ప్రజలకూ అర్థమయ్యే రీతిలో చెప్పడం ప్రజాస్వామికవాదుల బాధ్యత. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు రాజ్యాంగ పరమైన ప్రయత్నం వెంటనే మొదలుపెట్టాలని మేం డిమాండ్ చేస్తున్నాం. స్పష్టమైన కార్యాచరణ మొదలుపెట్టి యువకుల్లో, విద్యార్థుల్లో నెలకొన్న మానసిక ఉద్వేగాలను తగ్గించడం ప్రభుత్వం బాధ్యత. తెలంగాణవాద నాయకులు ఆవేశపూరితమైన ఉపన్యాసాలు చేస్తూ ప్రజలను, యువకులను రెచ్చగొట్టకూడదని మేం భావిస్తున్నాం. తెలంగాణ ఏర్పాటు కోసం ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించడానికి మా మద్దతు తెలుపుతున్నాం. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యేలోగా తెలంగాణకు నష్టం కలిగిస్తున్న విధానాలు, నిర్ణయాలను కొనసాగించకుండా చూడాల్సిన బాధ్యతకూడా రాష్ట్రప్రభుత్వానిదేనని గుర్తుచేస్తున్నాం.

**తేదీ : 30-01-2010**

**మానవహక్కుల వేదిక**

**Human Rights Forum**

**ప్రచురణకర్తలు: ఎస్. జీవన్ కుమార్-అధ్యక్షుడు, హైదరాబాద్. ఫోన్ : 98489 86286; వి.ఎస్. కృష్ణ-ప్రధాన కార్యదర్శి, విశాఖపట్నం. ఫోన్: 94404 11899**